క్లుప్తంగా

అగ్నిబాధితులకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం



ముసునూరు: ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదాల్లో బాధిత కుటుంబీకులకు నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఆర్థిక సహాయం అందజేశారు. లోపూడి గ్రామానికి చెందిన తోట సత్యవతి, గుళ్లపూడికి చెందిన యల్లమెల్లి బేబి, యల్లమెల్లి లక్ష్మి కుటుంబాలు అగ్ని ప్రమాదాల్లో నివాస గృహాలు దగ్ధమై సర్వస్వం కోల్పోయారు. ఆదివారం వీరికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం అందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నుంచి సహాయం అందేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కొండా దుర్గాభవాని, జెడ్పీటీసీ డా. వరికూటి ప్రతాప్, వైస్ ఎంపీపీలు రాజానాయన, గంగాధర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నాగవల్లేశ్వరరావు, సర్పంచ్‌లు పేరం కృష్ణ, ఆర్.శ్రీదేవి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో 'స్పందన'

నూజివీడు: పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని సబ్ కలెక్టర్ ఆదర్ష్ రాజేంద్రన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి కార్యాలయంలో డివిజన్‌లోని ప్రజల నుంచి వారి సమస్యలపై అర్జీలను స్వీకరించి వాటిని గడువులోగా పరిష్కరిస్తామన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్పందనలో ప్రజలు అర్జీలను అందజేయవచ్చని చెప్పారు.

పంట నమోదు తప్పనిసరి

ఎ.కొండూరు: రబీ సీజన్‌లో పంట సాగు చేసే రైతులందరూ తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని వ్యవసాయ శాఖాధికారి టిప్పుసుల్తాన్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ చీమలపాడు, పోలిశెట్టిపాడు, ఎ.కొండూరు, కంభంపాడు, కోడూరు, రేపూడి, రామచంద్రాపురం, కృష్ణారావుపాలెం తదితర గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల సిబ్బంది రైతులు సాగు చేసిన పంట వివరాలను నమోదు చేస్తున్నారన్నారు. పంటల వివరాలను పంట పొలాల్లోకి వెళ్లి నమోదు చేయాలని సూచించారు. నేటివరకు సుమారుగా మొక్కజొన్న 600 ఎకరాల్లో, వరి 400 ఎకరాల్లో పంట నమోదు చేశారని చెప్పారు. పంట నమోదు చేయించుకోవడం వల్ల సున్నా వడ్డీ, పంట రుణాలు, ఉచిత పంటల బీమా, పంట నష్టం, పలు రకాల ప్రభుత్వ పథకాలకు అర్హులవుతారని వివరించారు.

వేణుగోపాలుని సేవలో డీఆర్‌ఓ

నెమలి(గంపలగూడెం): నెమలి వేణుగోపాల స్వామిని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్వీ నాగేశ్వరరావు దంపతులు ఆదివారం దర్శించుకొన్నారు. ఆయనకు అర్చకులు సాదరంగా ఆహ్వానం పలికారు. ప్రత్యేక పూజలో పాల్గొన్న అనంతరం డీఆర్‌ఓ దంపతులను ఆలయ ప్రధాన అర్చకులు తిరునగరి గోపాలాచార్యులు అర్చకబృందం ఆశీర్వదించి స్వామి ప్రసాదం, మెమెంటో అందజేశారు. తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యులు కావూరి వినయ్‌కుమార్, సర్పంచ్ దుబ్బాకు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ సెలక్షన్స్‌లో 18 మంది ఎంపిక



తిరువూరు: స్థానిక శ్రీ వాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం బీటెక్ విద్యార్థులకు క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించారు. సదర్లాండ్ సంస్థ నిర్వహించిన రాత పరీక్ష, ఇంటర్వ్యూలలో 215 మంది పాల్గొనగా 18 మంది ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు తెలిపారు. రంగా నాగేంద్రబాబు, డైరెక్టర్ పోట్రు మనోజ్ కల్యాణ్, శిక్షణ ప్రాంగణ ఎంపికల సమన్వయకర్తలు షేక్ షరీఫ్, ఎంహెచ్ఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

అయోధ్య రాముని అక్షింతల పంపిణీ



మైలవరం: అయోధ్యలో రామ జన్మభూమి భవ్య మందిరం నుంచి వచ్చిన అక్షింతలను మైలవరంలో రామ భక్తులకు పంపిణీ చేశారు. స్థానిక రామాలయం రోడ్డులో ముగింపు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు రేగళ్ల రఘునాథరెడ్డి, మైలవరం అసెంబ్లీ కో–కన్వీనర్ పి. వెంకటేశ్వరరావు, నాయకులు పి. కోటేశ్వరరావు, జె. నరేంద్ర, వంశీకృష్ణ, జె. శేఖర్, మట్టా రామారావు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయం పండుగే

- రైతులకు సీఎం జగన్ భరోసా
- నియోజకవర్గంలో 92 రైతు భరోసా కేంద్రాల ఏర్పాటు
- అందుబాటులో వ్యవసాయ సేవలు



నూజివీడు మండలం తుక్కులూరులోని రైతు భరోసా కేంద్రం

నూజివీడు: ఆరుగాలం చెమటోడ్చి పంటలు పండించే రైతులకు పంట చేతికి వచ్చే వరకు అడుగడుగునా కష్టాలే. భూ మాతను నమ్ముకున్న రైతులు ఎన్ని కష్టాలు ఎదురైనా తట్టుకుని నారు పోసి, నాట్లు వేసి పంట పండించేవారు. పంటల సాగుకు పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి పంట చేతికి వచ్చిన తరువాత అప్పిచ్చినవారికే అయినకాడికే అమ్ముకునే దుస్థితి.. మందు కట్టలు కావాలన్నా, విత్తనాలు కావాలన్నా మండల కేంద్రాలకు వెళ్లి గంటల కొద్దీ పడిగాపులు పడేవారు.. ఇదంతా గతంలో పరిస్థితి. రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించాక ఈ పరిస్థితులు ఒక్కసారిగా మారాయి. వ్యవసాయ రంగంలో విప్లవాత్మకమైన మార్పులకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం శ్రీకారం చుట్టడమే కాకుండా అమలు చేసి చూపిస్తూ వ్యవసాయాన్ని పండగగా మార్చింది. రైతు భరోసా పథకం ద్వారా పెట్టుబడి సాయాన్ని సాగుకు ముందే అందజేస్తూ రైతులకు భరోసాను కల్పిస్తోంది. దీనికి తోడు గ్రామగ్రామాన రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రభుత్వం వ్యవసాయ సేవలను రైతుల చెంతకు తీసుకువచ్చింది. ప్రతి గ్రామానికి వ్యవసాయ, ఉద్యాన సహాయకులను నియమించి రైతులకు ప్రభుత్వ సేవలను వారి గడప వద్దకే తీసుకువచ్చింది. దీంతో వ్యవసాయ శాఖ ద్వారా క్షేత్ర స్థాయిలో గతంలో ఎన్నడూ లేని విధంగా రైతులకు ప్రభుత్వ సేవలు అందుతున్నాయి.

రైతు భరోసా కేంద్రాల ఏర్పాటు

ప్రభుత్వానికి, రైతులకు మధ్య దళారీ వ్యవస్థ లేకుండా ప్రభుత్వం అందజేస్తున్న సేవలన్నీ రైతుల చెంతకే వెళ్లేందుకు గాను గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎరువులు, విత్తనాలు, పచ్చిరొట్ట విత్తనాలు అందించడం, ధాన్యాన్ని కొనుగోలు చేయడం వంటివన్నీ ఈ రైతు భరోసా కేంద్రాల్లోనే నిర్వహిస్తున్నారు. రానున్న రోజుల్లో రైతు భరోసా కేంద్రాలకు అనుసంధానంగా గోడౌన్‌లు, కోల్డ్‌స్టోరేజీలను నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. అంతేగాకుండా ప్రాథమిక స్థాయిలో ఫుడ్ ప్రాసెసింగ్ సెంటర్లను ఏర్పాటు చేయడానికి కసరత్తు చేస్తోంది. నూజివీడు నియోజకవర్గంలో ప్రస్తుతం 92 రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు వ్యవసాయానికి సంబంధించిన సేవలను అందజేస్తోంది. వీటన్నింటికీ తోడు వందలాది మంది వ్యవసాయ సహాయకులను, ఉద్యాన సహాయకులను, సెరీకల్చర్ సహాయకులను, పశుసంవర్ధక సహాయకులను నియమించి రైతులకు అవసరమైన సేవలను అందిస్తోంది. వీరు పంటల సాగులోను, తెగుళ్ల నివారణకు సకాలంలో సలహాలు, సూచనలు అందిస్తూ రైతులకు చేదోడు వాదోడుగా ఉంటున్నారు. దేశానికి అన్నంపెట్టే రైతన్నకు ఎంత చేసినా తక్కువేనని సానుకూల దృక్పథంతో ప్రభుత్వం వ్యవసాయ రంగంపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది. రైతు భరోసా కేంద్రాలు రైతులకు ప్రతి విషయంలోనూ చేదోడు వాదోడుగా ఉంటూ ప్రతి సమస్యను పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నాయి.

రైతులకు ఎంతో మేలు



గతంలో ఎరువులు, విత్తనాలు కావాలంటే మండల కేంద్రానికి వెళ్లేవాళ్లం. ఇప్పుడు ఎక్కడికీ వెళ్లాల్సిన అవసరం లేదు. గ్రామంలోని రైతుభరోసా కేంద్రంలోనే విత్తనాలు, ఎరువులు, పచ్చిరొట్ట విత్తనాలు తదితరాలు అన్నీ లభిస్తున్నాయి. రైతులకు అవసరమైన సేవలన్నీ రైతు భరోసా కేంద్రాల్లోనే లభిస్తున్నాయి.

– పల్లె రవీంద్రరెడ్డి, రైతు తూర్పు దిగవల్లి, నూజివీడు మండలం

నేటి నుంచి ఈదర సహాయమాత తిరునాళ్ల



విద్యుత్ దీపాల వెలుగులో ఈదర సహాయ మాత కొండ

ఆగిరిపల్లి: మండల పరిధిలోని ఈదరలో సోమవారం నుంచి ఈనెల 24వ తేదీ వరకు ఈదర సహాయ మాత తిరునాళ్ల జరుగుతుందని, ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశామని ఫాదర్ ప్రకాష్ తెలిపారు. ఉత్సవాలకు ఈదర సహాయ మాత కొండను విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించామని చెప్పారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్ఐ చంటిబాబు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. మూడు రోజులపాటు జరిగే తిరునాళ్ల ఉత్సవాలకు చుట్టుపక్కల ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారని వివరించారు.

అంబేడ్కర్, పూలే ఆలోచనా విధానాలతో అభివృద్ధి



మాట్లాడుతున్న పాటిల్

ఇబ్రహీంపట్నం: అంబేడ్కర్, పూలే ఆలోచనా విధానాలకు అనుగుణంగా ట్రేడ్ యూనియన్లు పారిశ్రామిక రంగంలో అభివృద్ధి సాధించాలని ఆల్ ఇండియా ఇండిపెండెంట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు జేఎస్ పాటిల్ అన్నారు. ఏపీఎస్ఈబీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పూలే–అంబేడ్కర్ ఆలోచనల ట్రేడ్ యూనియన్ ఆవశ్యకతపై ఆదివారం అవగాహన సదస్సు జరిగింది. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ పరిశ్రమలు మనుగడ సాధించేందుకు ట్రేడ్ యూనియన్ సేవలు ఎంతో అవసరమన్నారు. పరిశ్రమల అభివృద్ధితో పాటు సమాజ అభివృద్ధికి దోహద పడాలన్నారు. జాతీయ కార్యదర్శి ఏవీ కిరణ్, నాయకులు వసంతరావు, సోమశేఖర్, కల్యాణ్ కుమార్, జయకర్ రాయ్, ఉమా విజయ్ చంద్, మణిబాబు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపునకు కృషి



సమావేశంలో పాల్గొన్న కాపు సంఘ నాయకులు

తిరువూరు: వైఎస్సార్ సీపీ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కాపు సంక్షేమ సంఘం నియోజకవర్గ గౌరవాధ్యక్షుడు సింగంశెట్టి రాంబాబు అన్నారు. స్థానిక సూర్యా ఫంక్షన్ హాల్‌లో ఆదివారం తిరువూరు నియోజకవర్గ కాపు నాయకుల సమావేశం జరిగింది. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులైన నల్లగట్ల స్వామిదాసును అభినందిస్తూ సమావేశంలో తీర్మానించారు. వైఎస్సార్ సీపీ గెలుపునకు తమ వంతు కృషి చేయాలని నిర్ణయించారు. సంఘ నాయకులు వెలుగోటి ఆదినారాయణ, తిరుమలశెట్టి వేణుబాబు, పసుపులేటి శేఖర్‌బాబు, వాళ్ల సురేష్ పాల్గొన్నారు.

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

మైలవరం: మైలవరంలో ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో మహిళలకు నిర్వహించిన ముగ్గుల పోటీలలో విజేతలకు నిర్వాహకులు ఆదివారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్య వైశ్య సంఘం నాయకులు కాజా మహేష్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మహిళలకు ప్రతి ఏటా ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. మైలవరం రామాలయం వీధిలో వాసవీ మహిళా మండలి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారని చెప్పారు. ఆర్య వైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బయన శ్రీనివాసరావు, కాజా మహేష్‌లు ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాలుగవ బహుమతులు అందజేశారు. పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మదర్ థెరిస్సా మహిళా మండలి అధ్యక్షురాలు కోయ సుధ, అమరావతి మహిళా మండలి నాయకురాలు రాయల సత్యవతి కుమారి, ఆర్యవైశ్య మహిళా మండలి నాయకురాలు విజయనిర్మల, చాంబర్ ఆఫ్ కామర్స్ నుంచి కె. మధు, జిల్లా అధ్యక్షులు దూలగొండి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వేగంగా కులగణన సర్వే



కులగణన సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ వెంకటరమణ

నరసాపురం (విస్సన్నపేట): మండలంలో అన్ని సచివాలయాల పరిధిలో కులగణన సర్వే వేగంగా జరుగుతోందని ఎంపీడీఓ ఎస్. వెంకటరమణ అన్నారు. నరసాపురం గ్రామంలో కులగణన సర్వేను ఎంపీడీఓ ఆదివారం పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి డిజిటల్ విధానంలో సర్వే చేస్తున్నారని, ప్రజలు సహకరించాలని ఎంపీడీఓ కోరారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి

ఆగిరిపల్లి: పేదలకు అందిస్తున్న ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆముదాల ఇస్సాకు అన్నారు. ఆదివారం సూరవరం, కృష్ణవరం గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. సర్పంచులు గరికపాటి వెంకటేశ్వరరావు, కమ్మిలి జ్యోతి లబ్ధిదారులకు గ్యాస్ కనెక్షన్లు, హెల్త్ కార్డులు అందజేశారు. ఎంఈఓ కొవ్వలి ఆనంద్ కుమార్, బీజేపీ మండల అధ్యక్షుడు కొవ్వలి బాబురావు, భాగ్యలక్ష్మి ఇండేన్ గ్యాస్ నిర్వాహకులు పాలడుగు శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు సంగమయ్య, షేక్ మీర్జావలి పాల్గొన్నారు.

మండల క్రికెట్ విజేత కంభంపాడు టీమ్



కంభంపాడు టీమ్‌కు ప్రథమ బహుమతి అందిస్తున్న చెన్నారావు

ఎ.కొండూరు: సంక్రాంతి సందర్భంగా ఈనెల 13 నుంచి చీమలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ పోటీల్లో 15 టీమ్‌లు పాల్గొని ప్రతిభను కనబరిచాయి. ఫైనల్ పోటీలో కంభంపాడు, చీమలపాడు జట్లు తలపడ్డాయి. హోరాహోరీగా జరిగిన మ్యాచ్‌లో కంభంపాడు జట్టు విజేతగా నిలిచింది. కంభంపాడు క్రికెట్ టీమ్‌కు వైఎస్సార్ సీపీ మండల యూత్ అధ్యక్షుడు కాలసాని చెన్నారావు రూ. 10 వేలు ప్రోత్సాహక బహుమతి అందించారు. ద్వితీయ బహుమతి చీమలపాడు టీమ్‌కు రుద్రవరం గ్రామానికి చెందిన కిరణ్‌కుమార్‌రెడ్డి 5,116 అందించారని నిర్వాహకులు వంశీ, తరుణ్ తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ భూక్య గనియా, వైఎస్సార్ సీపీ నాయకులు పి. వడ్డికాసులు, డి. సతీష్ తదితరులు పాల్గొన్నారు.

లెనిన్‌కు ఘన నివాళి



లెనిన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

ఎ.కొండూరు: కమ్యూనిస్టు యోధుడు వీఐ లెనిన్ వర్ధంతి కార్యక్రమం సీపీఐ ఆధ్వర్యంలో చీమలపాడు మెయిన్ సెంటర్‌లో ఆదివారం జరిగింది. అమరవీరుల స్మారక స్థూపం వద్ద లెనిన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఐ మండల కార్యదర్శి మేకల డేవిడ్ మాట్లాడుతూ కమ్యూనిస్టు ఉద్యమ వ్యాప్తికి లెనిన్ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో షేక్ కరిముల్లా, నాగేశ్వరరావు, బాబు, పి. చిన్ని తదితరులు పాల్గొన్నారు.

- **తిరువూరు:** కమ్యూనిస్టు యోధుడు లెనిన్ శత వర్ధంతి కార్యక్రమం స్థానిక సుంకర వీరభద్రరావు భవన్‌లో ఆదివారం జరిగింది. లెనిన్ చిత్రపటానికి సీపీఐ నాయకులు పసుపులేటి వెంకయ్య, తూము కృష్ణయ్య, చిలుకూరి వెంకటేశ్వరరావు, షేక్ నాగులమీరా, మాలపాటి ఉదయ్ తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రపంచవ్యాప్తంగా సోషలిజం వ్యాప్తికి లెనిన్ చేసిన కృషిని వక్తలు కొనియాడారు.

నేడు శ్రీకృష్ణరాయబారం నాటక ప్రదర్శన

తిరువూరు: శ్రీ సత్యసాయి నాట్య మండలి ఆధ్వర్యంలో సోమవారం రాత్రి తిరువూరులో శ్రీకృష్ణరాయబారం నాటక ప్రదర్శన జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. బైపాస్‌రోడ్డు లోని లక్ష్మీగణపతి కల్యాణ మండపంలో రాత్రి 8 గంటలకు ఈ ప్రదర్శన జరుగుతుందని, పేరొందిన కళాకారులు ముఖ్య పాత్రలు పోషిస్తారని చెప్పారు.

కోదండ రామాలయం ముస్తాబు

చాట్రాయి: అయోధ్యలో రామాలయ ప్రతిష్ఠ సందర్భంగా మండలంలోని చనుబండ గ్రామంలో అపర భద్రాద్రిగా పేరుగాంచిన శ్రీకోదండ రామాలయం ముస్తాబైంది. రాముడి జెండాలు, తోరణాలతో ఆలయాన్ని అలంకరించారు. ఆలయానికి ఈశాన్యంలో ఉన్న కోనేరు ఆంజనేయ స్వామి విగ్రహాన్ని కూడా ముస్తాబు చేశారు. కోనేరు అభయాంజనేయ స్వామి విగ్రహం వద్ద సోమవారం భారీ అన్నదానం ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు. అదేవిధంగా మండలంలోని అన్ని గ్రామాల్లో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని పలు కార్యక్రమాలు చేపట్టనున్నారు.

మహిళల అభ్యున్నతికి జగనన్న కృషి

జగ్గయ్యపేట అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ వారి అభ్యున్నతికి అనేక పథకాలు, కార్యక్రమాలను అమలుచేస్తున్నారని జగ్గయ్యపేట మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ కొనియాడారు. స్థానిక 26 వ వార్డులో రాజశేఖరరెడ్డి మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహుమతి ప్రదానోత్సవం కార్యక్రమానికి హాజరైన వైస్ చైర్మన్ ప్రభాకర్ విజేతలకు బహుమతులను అందజేసి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతి అని, ఇప్పటికే వైఎస్సార్ ఆసరా, సున్నా వడ్డీ, వైఎస్సార్ చేయూత, అమ్మఒడి వంటి పథకాల ద్వారా మహిళా సంక్షేమానికి కృషి చేస్తున్నారన్నారు. మహిళల అభ్యున్నతే ధ్యేయంగా పాలన సాగిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అయ్యేందుకు రానున్న ఎన్నికల్లో మహిళలంతా ఆయనకు అండగా ఉండాలని కోరారు. పేట ఎమ్మెల్యేగా సామినేని ఉదయభానును మరోసారి ఆశీర్వాదించాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ హఫీజున్నీసా, మాజీ కౌన్సిలర్లు పద్మ, నాగమణి, సుధారాణి, హబీబా, రాజ్యలక్ష్మి, పట్టణ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మునిహేరా, మహిళా సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ మండల కార్యకర్తల సమావేశం

విస్సన్నపేట: వైఎస్సార్ సీపీ మండల స్థాయి కార్యకర్తల సమావేశం స్థానిక పుట్రేల రోడ్డులో ఆర్‌సీఎం చర్చి ఎదురుగా ఉన్న మామిడికాయ మార్కెట్ వద్ద సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు జరుగుతుందని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు నెక్కళపు కుటుంబరావు ఆదివారం తెలిపారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు, ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దిరెడ్డి సూర్యనారాయణ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, ప్రజాప్రతినిధులు పాల్గొంటారన్నారు.

31న బలివేలో తాత్కాలిక దుకాణాలకు వేలం

ముసునూరు: ప్రసిద్ధ శైవ క్షేత్రం బలివేలో మహా శివ రాత్రి సందర్భంగా మార్చి 7 నుంచి 9 వరకు జరుగనున్న బలివే రామలింగేశ్వరస్వామి ఉత్సవాల్లో తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు ఈనెల 31న బహిరంగ వేలం నిర్వహిస్తామని ఆలయ ఈఓ ఆకుల కొండలరావు, కమిటీ చైర్మన్ నాగుల నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు జరుగనున్న మహోత్సవాల ఉత్సవ ప్రాంగణంలో వ్యాపారాలు నిర్వహించుకునేందుకు అవసరమైన తాత్కాలిక దుకాణ సముదాయాల ఏర్పాటు, కొబ్బరి చిప్పల సేకరణకు వేలం నిర్వహిస్తామన్నారు. ఆసక్తిగలవారు దుకాణ స్థలాల కోసం రూ.50 వేలు, కొబ్బరి చిప్పల సేకరణదారులు రూ.20 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు.

జమలాపురానికి సైకిల్ యాత్ర



తోటమూల(గంపలగూడెం): అయోధ్య ఆలయ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా గంపలగూడెం మండలం తోటమూల అభయాంజనేయస్వామి భక్తబృందం జమలాపురానికి ఆదివారం సైకిల్ యాత్ర కొనసాగించారు. గ్రామంలోని అభయాంజనేయ స్వామి ఆలయం నుంచి ప్రారంభించిన యాత్ర కొత్తపల్లి మీదుగా జమలాపురానికి 35 కిలోమీటర్ల దూరం కొనసాగింది. శ్రీరామ, ఆంజనేయస్వామి భక్త బృందం సైకిళ్లకు జెండాలను కట్టుకొని జైరామ్, జైహనుమాన్ నినాదాలు చేస్తూ ముందుకు సాగారు.

మొక్కలు నాటిన విద్యార్థులు

పోచంపల్లి(జగ్గయ్యపేట): ఎన్ఎస్ఎస్ పథకంలో భాగంగా మండలంలోని పోచంపల్లిలో బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఆదివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలోని వీధుల వెంట ఉన్న చెత్తా చెదారాన్ని తొలగించారు. దోమల నియంత్రణకు మందులు పిచికారీ చేశారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్లు బాలమురళీధర్, విజయప్రకాష్, ఫీల్డ్ అసిస్టెంట్ అంబేడ్కర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పథకాలపై ప్రజలకు అవగాహన

జగ్గయ్యపేట అర్బన్: స్థానిక ఉక్కు కళావేదికలో ఆదివారం జగ్గయ్యపేట పట్టణంలోని మూడు నుంచి తొమ్మిదవ సచివాలయాల పరిధికి సంబంధించి వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్రప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీహెచ్ నాగమల్లేశ్వరరావు, మెప్మా సిబ్బంది, బీజేపీ నాయకులు అన్నెపాక శ్రీకాంత్, మన్నె శ్రీనివాసరావు, గోలి రాఘవేంద్ర, మున్సిపల్, హెల్త్, ఐసీడీఎస్, మెప్మా, హౌసింగ్ విభాల అధికారులు పాల్గొన్నారు.

నేడు 14వ సచివాలయం వద్ద..

స్థానిక ఎస్ఎస్‌పీ కాలనీలోని 14వ సచివాలయం వద్ద సోమవారం ఉదయం పది గంటలకు వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ నాగమల్లేశ్వరరావు తెలిపారు. ప్రజలు హాజరు కావాలని ఆయన కోరారు.